


సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1716, బ్యాంక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం బుధవారం 566.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు విడుదలవుతోంది.



70,663 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 68,127 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 70,663 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

కంది రైతుల పేర్లు నమోదుకు చివరి గడువు నేడు

నరసరావుపేట: రైతులు తాము పండించిన కందులను రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయించాలనుకుంటే తమ పేర్లను సీఎం యాప్‌లో నమోదు చేసుకోవడానికి ఈ నెల 9వ తేదీ తుది గడువని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో రైతులు 26,908 హెక్టార్లలో కంది వేశారని, 50,879 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ పంట జిల్లాలోని 387 రైతుసేవా కేంద్రాల పరిధిలో విస్తరించి ఉందన్నారు. మద్దతు ధర క్వింటాలుకు రూ.7,550గా ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ క్రాప్‌లో పంట నమోదు చేసుకున్న రైతులు తమ పేర్లను గురువారం సీఎం యాప్‌లో కూడా నమోదు చేసుకోవాలని కోరారు.

మహంకాళీ అమ్మవారి గుడి హుండీ ఆదాయం లెక్కింపు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలోని మహంకాళీ అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సునీల్ కుమార్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీల్లోని కానుకలను గుంటూరు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. వెంకట శ్రీనివాసులు ఆధ్వర్యంలో తెరిచి లెక్కించగా.. రూ. 12,66,254 ఆదాయం వచ్చిందని వివరించారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త డి.రంగ ప్రసాద్ పాల్గొన్నారు.

46 మందికి పీహెచ్‌ఎన్‌లుగా ప్రమోషన్

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో హెల్త్ విజిటర్స్‌గా పనిచేస్తున్న 46 మందికి పబ్లిక్ హెల్త్ నర్సులుగా ప్రమోషన్ లభించింది. బుధవారం గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర పదోన్నతి ఉత్తర్వులను అందజేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: ఎంపీహెచ్‌ఈఓ, సీహెచ్‌ఓల డైరీని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉద్యోగులకు ప్రభుత్వ జీవోల గురించి, జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్య సిబ్బంది వివరాలతో సమాచారం తెలుసుకునేలా డైరీ రూపొందించారని అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కె.శేషగిరి రాజు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి.ఆనందరావు, జిల్లా ప్రెసిడెంట్ టి.సాంబయ్య, జిల్లా సెక్రెటరీ ప్రసాద స్వామి, జిల్లా ట్రెజరర్ నూనె రామకృష్ణారావు, డెప్యూటీ డెమో ఎస్.వెంకటేశ్వర్లు, పున్నారెడ్డి, గణేష్, నరేంద్ర, విజయకుమార్ పాల్గొన్నారు.

చెన్నైకి తరలిస్తున్న 80 ఆవుల పట్టివేత

మంగళగిరి: విజయనగరం నుంచి చిలకలూరిపేట మీదుగా చెన్నైకి గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను హైందవ సంఘాలు అడ్డుకున్నాయి. మంగళగిరి కాజ టోల్‌గేట్ వద్ద సుమారు 80 గోవులను పోలీసులు పట్టుకున్నారు. వాటిని మంగళగిరి గౌడియ మఠం గోశాలకు తరలించారు. దీనికి సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు రూరల్ పోలీసులు బుధవారం తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): అరుణాచలం పవిత్ర పుణ్యక్షేత్రంలో ఈ నెల 13వ తేదీన జరుగనున్న పౌర్ణమి గిరిప్రదక్షిణ మహోత్సవాలకు సంబంధించి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ ఎస్‌ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ బుధవారం తెలిపారు. గుంటూరు -2 డిపో నుంచి ఈ నెల 11న రాత్రి 9.15 గంటలకు బస్సు బయలుదేరి అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7382897459 ఫోను నంబరులో సంప్రదించాలని సూచించారు.

కోతలు పూర్తి.. కొనుగోళ్లు నాస్తి!

కూటమి ప్రభుత్వ పాలనలో అన్నదాతలకు కన్నీరే మిగులుతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించాలంటే నానా అవస్థలు పడాల్సిన దుస్థితి నేడు కనిపిస్తోంది. రైతు సేవా కేంద్రాలలో విక్రయించాలని భావిస్తే ప్రభుత్వ నిబంధనలు అడ్డంకిగా మారుతున్నాయి. 17 శాతం దాటిన తేమ, నల్ల గింజ, మొలకెత్తిన గింజలు పేరిట ప్రైవేట్ వ్యాపారులు దోచుకుంటున్నారు. వారు నిర్ణయించిందే ధర అవుతోంది. తేమ శాతం ఎక్కువన్న సాకుతో అడిగినన్ని కేజీలు ఇవ్వాల్సి వస్తోంది.

కూటమి సర్కారు నిర్లక్ష్యంతో అన్నదాతలకు కన్నీళ్లు

- జిల్లాలో ఖరీఫ్ సాగు 34,396 హెక్టార్లు
- రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు లక్ష్యం కేవలం 5 వేల మెట్రిక్ టన్నులే
- ఇప్పటివరకు కొనుగోలు చేసింది 3,518 టన్నులు మాత్రమే
- ఇందులో అధికభాగం వ్యాపారులు, మిల్లర్ల నుంచే కొనుగోలు
- ప్రత్యామ్నాయం లేక ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్న అన్నదాతలు
- 75 కిలోల బస్తా కేవలం రూ.1,400కే కొంటున్న వ్యాపారులు
- తేమ శాతం, నాణ్యత వంటి సర్కారు నిబంధనలే రైతులకు శాపాలు



నకరికల్లులో ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం



సాక్షి, నరసరావుపేట: ఖరీఫ్ సాగులో భాగంగా పల్నాడు జిల్లాలో 34,396 హెక్టార్లలో వరి పంటను రైతులు సాగు చేశారు. జిల్లాలో 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. 334 రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం దిగుబడి భారీగా ఉండటం, ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ పెరగడంతో రైతులు ప్రభుత్వం వైపు చూస్తున్నారు. కొనుగోళ్ల లక్ష్యం పెంచమని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో 5 వేల మెట్రిక్ టన్నులు అదనంగా కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటివరకు జిల్లాలో 3,518 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొన్నారు. ఇందులో కూడా మిల్లర్లు, వ్యాపారుల నుంచి అధికారులు కొనుగోలు చేసిన ధాన్యమే అధికంగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేసి ప్రభుత్వానికి మద్దతు ధరకు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది.

ప్రభుత్వం 'ఏ' గ్రేడు రకం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడం వల్ల రైతులు మద్దతు ధర పొందలేకపోతున్నారు. 'పాయ ఉండకూడదు, నల్ల గింజ రాకూడదు, రంగు మారకూడదు, మానుకాయ లాంటివి తగలకూడదు. ఇక తేమ శాతం 17 లోపు ఉండాలనే' ప్రభుత్వ నిబంధనలు ఆటంకంగా ఉన్నాయి. ఆరబెడితే తేమ శాతం తగ్గించే వీలుంది. మిగతావన్నీ రైతుల చేతుల్లో ఉండవు. గిట్టుబాటు ధర కల్పించడానికి నిబంధనల్లో కొన్నింటికి మినహాయింపు ఇవ్వాల్సిందే. ఏ, బీ, సీ, డీ గ్రేడులు పెట్టి వాటికి ధరలు నిర్ణయించి కొనుగోలు చేయాలనే సూచనలు వ్యక్తం అవుతున్నాయి.

తక్కువ ధరకే విక్రయం

ఖరీఫ్‌లో ధాన్యం ఎక్కువగా బస్తా రూ.1,400లోపే రైతులు అమ్ముకున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా వారు నిర్దేశించుకున్న లక్ష్యాలకు, వచ్చిన దిగుబడులకు చాలా వ్యత్యాసం ఉంది. దిగుబడుల్లో కనీసం 25 శాతం అయినా ప్రభుత్వం కొనగలిగితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. గతంలో ఆర్‌బీకే కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగాయి. ఇప్పుడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా అవి ఎక్కడ ఉన్నాయో కూడా రైతులకు అర్థం కాని పరిస్థితి. తెలంగాణ రాష్ట్రం నుంచి వ్యాపారులు వచ్చి ఇక్కడ బస్తా రూ.1,600-రూ.1,800 వరకు ధాన్యం కోసిన వెంటనే కొనుగోలు చేశారు. పక్క రాష్ట్రం వ్యాపారులను ఇక్కడకు రాకుండా కట్టడి చేసిన ఘటనలు కూడా వెలుగు చూశాయి. దీంతో స్థానిక వ్యాపారులు నిర్ణయించిందే ధరగా మారింది.

15 రోజులుగా కల్లంలోనే ధాన్యం



15 రోజులపాటు కల్లంలోనే ధాన్యం ఉంచా. వ్యాపారులు కొనడానికి రాలేదు. బస్తా రూ.1,200కు అడిగారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వాళ్లు వచ్చి చూసి తేమ ఉందని, అక్కడక్కడ పాయ తగులుతోందని పేర్కొన్నారు. తాము కొనలేమని చెప్పారు. తర్వాత పక్క ప్రాంతం నుంచి వచ్చిన వ్యాపారులు రూ.1,400కు కొన్నారు. నాలా చాలా మంది ఉన్నారు. ధాన్యానికి నాణ్యతను బట్టి ప్రభుత్వం రేటు నిర్ణయించి కొనుగోలు చేయాలి. ప్రతి గ్రామంలో దీనికి ఓ కేంద్రం ఉండాలి.

– షేక్ ఖాసిం, రైతు, కారెంపూడి

నాణ్యత తగ్గినా ధాన్యం కొనాలి



రెండు ఎకరాలలో వరి సాగు చేశా. పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయిద్దామని చూస్తే తేమ 17 శాతం కన్నా ఎక్కువ ఉందంటూ వెనక్కి పంపారు. ప్రభుత్వం కేవలం గ్రేడ్ ఏ, గ్రేడ్ బీ ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు. అలా కాకుండా తేమ శాతం 17 కన్నా ఎక్కువ ఉన్న వాటిని కొంత ధర తగ్గించి అయినా కొనుగోలు చేయాలి. అప్పుడే రైతులకు మేలు జరుగుతుంది. నిబంధనలు సడలించి వారిని ఆదుకోవాలి.

– కొనతం మల్లారెడ్డి, రైతు, నకరికల్లు

వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై దాష్టీకం

- డిగ్రీ చదువుతున్న విద్యార్థిని చితకబాదిన పోలీసులు
- బొల్లాపల్లి ఎస్సై తీరుపై తీవ్ర ఆరోపణలు
- కొట్టాక బాధితుడిని ఆసుపత్రికి తరలించిన వైనం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు, కార్యకర్తలపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో పోలీసుల దాష్టీకాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా బొల్లాపల్లి మండలం వెంకటరెడ్డి పురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన కుటుంబంలోని వారిపై దాడులు చేయడమే కాకుండా మరోవైపు పోలీసులు దాడి చేసి దారుణంగా కొట్టిన ఘటన వెలుగు చూసింది. సేకరించిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వాంకుడావవత్ బాలు నాయక్‌కు చెందిన ఆవులు తమ చేలో పడ్డాయని అదే గ్రామానికి చెందిన గాలం శ్రీను, పవన్ అనే వ్యక్తులు.. బాలునాయక్ భార్య వాకిలీబాయి, కుమారుడు దుర్గాప్రసాద్ నాయక్‌తో గత నెల 2వ తేదీన ఘర్షణకు దిగారు. అప్పుడు పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. తరువాత టీడీపీ నాయకుల ఒత్తిడితో ఈ నెల 7వ తేదీన బాలు నాయక్ కుమారుడైన దుర్గాప్రసాద్ నాయక్‌ను పొలంలో పని చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని బొల్లాపల్లి స్టేషనుకు తరలించారు. అదే రోజు పోలీసులు తమదైన శైలిలో దుర్గాప్రసాద్ శరీరంపై వాతలు తేలేటట్లు కొట్టడంతో సొమ్మసిల్లి పడిపోయాడు. కంగారుపడిన పోలీసులు వెంటనే బొల్లాపల్లిలోని ప్రభుత్వ వైద్యశాలకు దుర్గాప్రసాద్‌ను తరలించారు. అక్కడ లాభం లేదని, మెరుగైన చికిత్స కోసం వినుకొండ తరలించాలని వైద్యులు సూచించారు. వెంటనే ప్రయివేటు అంబులెన్సులో వినుకొండలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి బాధితుడిని మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఎస్సై బాలకృష్ణ అత్యుత్సాహం

బొల్లాపల్లి ఎస్సై బాలకృష్ణ వ్యవహార శైలిపై మొదటి నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి. అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తూ వేధిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా వెంకటరెడ్డిపురం గ్రామం కేసులో కూడా దుర్గాప్రసాద్ నాయక్‌ను తీవ్రంగా కొట్టారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. డిగ్రీ చదువుతున్న దుర్గాప్రసాద్ నాయక్ భవితవ్యం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పోలీసుల తీరును తప్పు పడుతూ న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు.

న్యాయపోరాటం చేస్తాం

దీనిపై దుర్గాప్రసాద్ బాబాయి కాశోజి నాయక్ మాట్లాడుతూ... '' బొల్లాపల్లి ఎస్సై మా బంధువైన దుర్గాప్రసాద్‌ను కావాలనే కొట్టారు. సొమ్మసిల్లి పడిపోయిన తర్వాత పోలీసులే హాస్పిటల్‌కు తరలించారు. బూట్ కాలితో తన్నడమే కాకుండా, బెల్టుతో వాతలు పడేలా కొట్టారు. న్యాయం చేయాల్సిన పోలీసులే ఇలా ప్రవర్తించడం దారుణం. మాకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని'' తెలిపారు.



ముక్కోటికి మంగళాద్రి ముస్తాబు

రేపు స్వామి ఉత్తర ద్వార దర్శనం

- బంగారు శంఖుతో తీర్థం
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరిలోని శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఏకాదశి రోజు తెల్లవారుజాము 4 గంటల నుంచే స్వామి దేవేరుల సమేతంగా బంగారు గరుడ వాహనంపై ఉత్తరద్వారం ద్వారా భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. దీనికోసం ఆలయ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్యేక క్యూలైన్లు అందుబాటులోకి తెచ్చారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.



ముస్తాబైన ఉత్తర ద్వార గోపురం

ఏకాదశి ఒక్కరోజునే సుమారు లక్ష మంది భక్తులు స్వామిని దర్శించుకునే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

దక్షిణావృత శంఖం

వైకుంఠ ఏకాదశి రోజున దక్షిణావృత శంఖంతో భక్తులకు తీర్థం అందించడం ఆనవాయితీగా వస్తోంది. 1820లో తంజావూరు మహారాజు వారణాసి యాత్రలో భాగంగా మార్గమధ్యలో లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని బంగారు తొడుగు గల దక్షిణావృత శంఖాన్ని సమర్పించారు. అప్పటి నుంచి ఏటా ముక్కోటి ఏకాదశి రోజున ఈ శంఖంతో లక్ష్మీనరసింహ స్వామికి అభిషేకం చేస్తారు. అనతరం ఆ శంఖం ద్వారానే భక్తులకు తీర్థం అందిస్తారు. ఈ శంఖం నుంచి నిత్యం ఓంకార నాదం వినిపిస్తుంటుందని చెబుతారు.

ఏర్పాట్లు పూర్తి



భక్తులకు ఎటువంటి ఆటంకాలు, ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. పిల్లలకు, వృద్ధులకు క్యూలైన్లు ఏర్పాటు చేశాం. బాలలకు బిస్కెట్లు, మజ్జిగ, తాగునీరు అందిస్తాం. సుమారుగా లక్ష మందికిపైగా భక్తులు రానున్నట్లు అంచనా వేస్తున్నాం.

– రామకోటిరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి

నేడు, రేపు ఉత్సవాలు

మంగళాద్రి క్షేత్రంలో ఈ నెల 9,10వ తేదీల్లో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 9వ తేదీ జాగరణ సందర్భంగా భజనలు, అన్నమయ్య సంకీర్తనలు, పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గురువారం స్వామిని జగన్మోహిని రూపంలో అలంకరించి పుష్పక విమానంపై ఊరేగిస్తారు. అర్ధరాత్రి దాటిన తరువాత తిరుమంజన ఉత్సవం నిర్వహిస్తారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా 10న వేకువ జామున 4 గంటల నుంచి స్వామి ఉత్తర ద్వార దర్శన భాగ్యం కల్పిస్తారు. మధ్యాహ్నం స్వామి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని ఈ ఏడాది దక్షిణావృత శంఖ తీర్థాన్ని 9, 10వ తేదీలలో ఇవ్వనున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

ముక్కోటి సందర్భంగా ఉత్సవ, భద్రతా ఏర్పాట్లను ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ బుధవారం ఆలయ ఈఓ. రామకోటిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 300 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు వినోద్‌కుమార్, శ్రీనివాసరావు, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్

నేడు రాధాకృష్ణుల కళ్యాణోత్సవం

అమరావతి: అమరావతిలోని భవద్గీతా మందిరంలో వేంచేసియున్న రాధాకృష్ణుని కళ్యాణ మహోత్సవాలు గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకుడు వలివేటి చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పెళ్లి అలంకరణ, ఎదుర్కోలు, రాధాకృష్ణుల కళ్యాణోత్సవం, సాయంత్రం స్వామి గ్రామోత్సవం ఉంటాయని పేర్కొన్నారు. అలాగే 10వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం ఉంటుందన్నారు. ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యుల సామూహిక గీతాపారాయణం నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గ్రామ సచివాలయంలో ఖాళీ కుర్చీలే దిక్కు



లంకెలకూరపాడు (ముప్పాళ్ళ): మండలంలోని లంకెలకూరపాడు గ్రామ సచివాలయం ఖాళీగా దర్శనమిస్తోంది. ఇటీవల జరిగిన బదిలీల ప్రక్రియలో భాగంగా ఇక్కడి నుంచి వెళ్లిన వారి స్థానాలు భర్తీ కాలేదు. మిగిలిన కొందరు ఉద్యోగులు మంగళవారం విధులకు హాజరు కాకపోవటం కూడా దీనికి మరో కారణం. డిజిటల్ అసిస్టెంట్ ఒక నెల సెలవుపై వెళ్లగా, సర్వేయర్ మెటర్నరీ లీవ్, మహిళా పోలీసు ముప్పాళ్ళలోని పోలీస్‌స్టేషన్‌లో విధులకు వెళ్లారు. వెల్ఫేర్ అసిస్టెంట్ సాయంత్రం వేలిముద్ర వేసే సమయానికి హాజరయ్యారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ జాడ లేదు. ఏఎన్‌ఎం కూడా పీహెచ్‌సీలో విధులకు వెళ్లిపోయారు. వీఆర్వో మాత్రమే విధుల్లో ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి మూడు గ్రామాలకు ఇన్‌చార్జ్ కావటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్, హార్టికల్చర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి.

క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి జిల్లా ఉత్తమ అవార్డు



డీఈఓ చంద్రకళ నుంచి అవార్డు అందుకుంటున్న షేక్ సైదా

మాచర్ల రూరల్: ఉపాధ్యాయులకు ధూళిపాళ్ళ గ్రామంలోని లయోలా కాలేజీలో పల్నాడు జిల్లా స్థాయి ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ముగింపు సందర్భంగా అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, ప్రవేశాల పెంపు తదితర అంశాలపై మాచర్ల మండలంలోని లింగాపురం గ్రామ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ సైదా ఇచ్చిన ప్రజెంటేషన్‌కు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రథమ బహుమతిని డీఈవో అందించారు. డీఈఓ చంద్రకళ, ఎంఈఓ అల్లి సురేష్ ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాటి రాజశేఖర్, రత్నప్రభ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌పై దాడి.. కేసు నమోదు

యడ్లపాడు: వక్ఫ్‌బోర్డు భూములను పరిశీలించేందుకు వెళ్లిన ఆ శాఖ ఇన్‌స్పెక్టర్‌పై కొందరు దాడి చేశారు. దీనిపై యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు జిల్లా వేములూరుపాడు గ్రామానికి చెందిన షేక్ కరీముల్లా బాషా పల్నాడు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌గా మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పరిధిలోని కొండవీడు గ్రామంలో ఉన్న పురాతన దర్గా అయిన హజరత్ బురావద్దీన్‌బాబా వారి దర్గా కింద వక్ఫ్ బోర్డుకు చెందిన 87.20 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. మూడేళ్లకు ఒకసారి వేలం పాటలో ఈ మాన్యం భూముల్ని దక్కించుకున్న రైతులు ఏటా శిస్తు చెల్లిస్తూ కౌలు చేసుకుంటారు. సదరు భూములకు మూడేళ్లుగా శిస్తు చెల్లింపులు చేయనందును వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి సందర్శనకు మంగళవారం మధ్యాహ్నం కరీముల్లా బాషా కొత్తపాలెం (పుట్టకోట) గ్రామంలోని దర్గాకు చెందిన మాన్యం భూముల్ని సందర్శించారు. సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీస్తుండటం గమనించిన గ్రామానికి చెందిన కాకర్లపూడి మాధవరావు, మరో ఐదుగురు కలిసి అసభ్య పదజాలంతో దుర్భాషలాడారు. ఆయన చేతిలో సెల్‌ఫోన్ లాక్కొని ధ్వంసం చేశారు. ఆయనపై దాడికి పాల్పడ్డారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ వి.బాలకృష్ణ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విభిన్న రంగాల్లో ప్రావీణ్యం అవసరం

- పల్నాడు డీఈవో ఎల్. చంద్రకళ
- ఘనంగా రంగోత్సవ్ -2025 పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో డీఈవోలు ఎల్. చంద్రకళ, సీవీ రేణుక తదితరులు

యడ్లపాడు: విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా విభిన్న రంగాల్లో ప్రావీణ్యం పెంచుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యాశిక్షణ సంస్థ ప్రిన్సిపల్, పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ పేర్కొన్నారు. అప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకోగలుగుతారని తెలిపారు. మండలంలోని బోయపాలెం డైట్ కళాశాల ప్రాంగణంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి రంగోత్సవ్-2025 పోటీలను బుధవారం గుంటూరు డీఈవో సీవీ రేణుకతో కలసి ఆమె ప్రారంభించారు. ఈ పోటీల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జానపద నృత్యం, రంగవల్లులు, చేతిరాత, చిత్రలేఖనం, స్లోగన్ రైటింగ్, డిజిటల్ పోస్టర్ డిజైన్, క్విజ్, రోల్‌ప్లే తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభా నైపుణ్యాలు చాటుకున్నారు. ప్రారంభోత్సవ సమావేశంలో డీఈవో ఎల్. చంద్రకళ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. పోటీలో ఈ ఏడాది నుంచి స్లోగన్ రైటింగ్, కంప్యూటర్‌లో డిజిటల్ పోస్టర్ తయారుచేయడం వంటి అంశాలు చేరడం విశేషమన్నారు. అనంతరం ఆయా విభాగాల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. డైట్ సీనియర్ లెక్చరల్ ఎస్ఎం సుభాని, కో ఆర్డినేటర్ డాక్టర్ కె. ప్రసాద్, పి.పోలేరు, ప్రభాకరరెడ్డి, యోగేశ్వరరావు, వై. శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎం.సౌజన్య, సమేధ, యాస్మిన్ పాల్గొన్నారు.

విజేతల వివరాలు...

జానపదం, పోస్టర్, చిత్రలేఖనం, స్లోగన్ రైటింగ్, రోల్‌ప్లే విభాగాల్లో ఓక్‌ల్యాండ్‌స్కూల్ (నరసరావుపేట), రంగోలిలో వెంకటేశ్వర బాలకుటీర్ (గుంటూరు), క్విజ్‌లో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, చేతి రాతలో జెడ్పీ హైస్కూల్(పొత్తూరు) ప్రథమ స్థానాల్లో నిలిచాయి. వీరితోపాటు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పాఠశాలలు, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ముగిసిన జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్



విజేతలకు మెడల్స్ అందజేస్తున్న ప్రతినిధులు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పిడుగురాళ్ల రూరల్: రెండు రోజులుగా హోరాహోరీగా సాగిన క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. రోటరీ ఇంట్రాక్ట్ స్పోర్ట్స్ మీట్ పేరిట ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రోటరీ ఇంట్రాక్టివ్ పీడీజీ తాళ్ల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... క్రీడల వల్ల శారీరక, మానసిక వికాసానికి అవకాశం ఉంటుందని చెప్పారు. చిన్ననాటి నుంచే ఇష్టమైన ఆటలో రాణించేందుకు విద్యార్థులు కృషి చేయాలని తెలిపారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గీతికా సీబీఎస్‌సీ స్కూల్ కరస్పాండెంట్ టి. బాలగంగాధర్‌రెడ్డి, డైరెక్టర్ టి. వెంకటరామిరెడ్డి, జిల్లా రోటరీ ఇంట్రాక్టివ్ మాజీ అధ్యక్షులు వడ్లమూడి రాజ్యలక్ష్మి, పట్టణ అధ్యక్షులు గుండా అశోక్‌బాబు, వనపర్తి రమేష్‌బాబు, పి. విష్ణుబాబు, నీరుమళ్ల రాజేష్, ముత్తారెడ్డి, గురవయ్య, సుబ్రహ్మయ్య, కొత్త హనుమంతరావు, కొలిశెట్టి శ్రీనివాసరావు, ఉటుకూరి గురునాథం, ఎలూరి పుల్లారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపుగా పంట.. రక్షణకు తంటా..



ముప్పాళ్ళ మండలంలోని చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన రైతు చక్కెర లక్ష్మీరెడ్డి తన మొక్కజొన్న పంటను కాపాడుకునే క్రమంలో పాత చీరెలను రక్షణ కవచంగా ఏర్పాటు చేశారు. రబీలో మొక్కజొన్న సాగు ఆశాజనకంగా ఉండి ప్రస్తుతం పంట కండె దశలో ఉంది. సత్తెనపల్లి-నరసరావుపేట ప్రధాన రహదారి కావటంతో వాహనదారులు, కోతుల బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు రోడ్డు వెంట ఉన్న పొలం గట్టు వెంబడి పాత చీరెలను ఒకదానికొకటి కుట్టి రక్షణగా ఏర్పాటు చేసుకున్నారు. – ముప్పాళ్ళ

భక్తిశ్రద్ధలతో ముగ్గురు రాజుల మహోత్సవం



వాక్యోపదేశం చేస్తున్న చిన్నాబత్తిని భాగ్యయ్య



పాల్గొన్న భక్తులు

పెదకూరపాడు: ముగ్గురు రాజుల మహోత్సవం బుధవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య ముఖ్య అతిథిగా మహోత్సవ సమష్టి పూజాబలి నిర్వహించారు. వాక్యోపదేశం చేస్తూ ప్రతి ఒక్కరూ క్షమ, దయ కలిగి ఇతరుల పట్ల ప్రేమ కలిగి ఉండాలన్నారు. ఎదుటివారికి సాయ పడాలని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మత గురువులకు ముగ్గురు రాజులు ఘనతను వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం కొవ్వొత్తుల సమర్పణ నిర్వహించారు. కాలచక్ర రహదారి వెంబడి ఏర్పాటు చేసిన ప్రత్యేక అంగళ్లు ఆకట్టుకున్నాయి. రాత్రి బాల ఏసుతో కూడిన మేరీమాత విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై గిరిబాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ముగ్గురు రాజుల దేవాలయ విచారణ గురువులు పెంటారెడ్డి రాజారెడ్డి, సహాయ గురువులు బాల ధీరజు ప్రార్థనలు చేసి భక్తులను ఆశీర్వదించారు.

140 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



వెల్దుర్తి: నిషేధిత నాటుసారా తయారీ విక్రయాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని ఎక్సైజ్ సీఐ ఎస్. వెంకట రమణ హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ స్టేషనులో బుధవారం సీఐ మాట్లాడుతూ.. ముందస్తు సమాచారంతో వెల్దుర్తి మండలం గుండ్లపాడులో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 65 లీటర్ల నాటుసారా, 1400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. మాచర్ల పరిసర ప్రాంతంలో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ అమ్ముతున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. దీనిపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.

శివ కోటేశ్వరరావుకు జాతీయ స్థాయి అవార్డు

గుంటూరు మెడికల్: గుంటూరు కొరిటెపాడుకు చెందిన శివకోటేశ్వరరావుకు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డు దక్కింది. జనవరి 6, 7వ తేదీలలో ఒడిశాలో 'హుస్సేన్ ఖాన్ ఏడవ జాతీయస్థాయి వర్క్ షాప్' జరిగింది. చివరి రోజు ఫొటోగ్రాఫర్లకు పోటీలు నిర్వహించారు. అందులో శివ కోటేశ్వరరావుకు ఒడిశాలోని బోండాస్ తెగ జీవనశైలిపై తీసిన ప్రత్యేక ఫొటోగ్రాఫ్‌కు ప్రత్యేక జూరీ అవార్డును ఇచ్చి ఘనంగా సన్మానించారు.

ఎన్‌టీఏ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట ఈస్ట్: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో రూపొందించిన రాష్ట్ర డైరీ, క్యాలెండర్‌ను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో అసోసియేషన్ కృషి అభినందనీయం అన్నారు. సమస్యల పరిష్కారంలో సహకారం అందిస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీల అంశంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న చట్టంలో అన్ని కేటగిరీల వారికి తగిన న్యాయం జరిగేలా చూడాలని అసోసియేషన్ ప్రతినిధులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. చట్టం అమలుకు ముందే ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌టీఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కోనూరు సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి మాతంగి సాంబశివరావు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు నిబంధనలు పాటించాలి



డీఎంహెచ్‌ఓ బి. రవిని సత్కరిస్తున్న ఆర్‌ఎంపీలు

నరసరావుపేట టౌన్: నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్‌ఎంపీలను డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయంలో జిల్లాలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతి లేకుండా రక్తపరీక్షల ల్యాబ్‌లు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. తనిఖీ సమయంలో ఆర్‌ఎంపీల వద్ద పెద్ద ఎత్తున ఫిజీషియన్ శాంపిల్స్ లభ్యమవుతున్నాయని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సూచనలు, సలహాలు ఇచ్చి ప్రాథమిక వైద్యం మాత్రమే అందించి పెద్ద వైద్యశాలలకు పంపాలని సూచించారు. నిబంధనలకు మించి వైద్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు షేక్ బాజీ మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి షేక్ సైదా, ట్రెజరర్ అంజుమ్ రాజు, సభ్యులు బాపతు చెన్నారెడ్డి, సాదినేని వీరాంజనేయులు, రాజు, వెంకట్రావు పాల్గొన్నారు. మొదట డీఎంహెచ్‌వోకు సంఘ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు.

రేపు వైకుంఠపురంలో ఉత్తరద్వార దర్శనం

- ముక్కోటి సందర్భంగా చురుగ్గా సన్నాహాలు
- 15 వేల మంది తరలివచ్చే అవకాశం



వైకుంఠపురం దేవస్థానం

తెనాలి: కళలకు నిలయంగా విలసిల్లిన తెనాలిలో శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురం రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా విలసిల్లుతోంది. పట్టణానికి దక్షిణంగా ప్రశాంత వాతావరణంలోని వైకుంఠపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తుల కొంగుబంగారంగా నిలిచింది. నిత్యకల్యాణం పచ్చతోరణంతో విలసిల్లే కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరుడు, భక్తాభీష్ట వరదుడై లక్ష్మీపద్మావతి సమేతంగా, పరమ ప్రసన్న శోభలు చిందిస్తూ, బహుముఖ వైభవోపేతుడై వెలుగొందుతున్నాడు. వేలాది మంది భక్తులు, దాతల వితరణ, పాలకవర్గాల కృషితో పవిత్ర యాత్రాస్థలంగా దినదినప్రవర్ధమానంగా ఎదుగుతున్న వైకుంఠపురం దేవస్థానం ముక్కోటి ఏకాదశి వేడుకలకు సన్నద్ధమవుతోంది. ఈనెల పదో తేదీన శుక్రవారం ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారదర్శన ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. ఆరోజు స్వామి, అమ్మవార్లు ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై వేంచేసి ఉండి భక్తులకు దర్శనమిస్తారు. ఆరోజు తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుంది. ఉత్తర ద్వారంలో, మూలవరుస దర్శించుకునేందుకు వీలుగా ప్రస్తుతమున్న క్యూలైన్లతోపాటు అదనంగా క్యూలైన్లు, ఎండ తగలకుండా చలువపందిళ్లను సిద్ధం చేస్తున్నారు. ఉచిత దర్శనంతోపాటు రూ.100, రూ.300 దర్శన ప్రవేశాలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేశారు. దర్శనానంతరం భక్తులకు దక్షిణావృత బంగారు శంఖుతీర్థం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారి అనుపమ, ట్రస్ట్‌బోర్డ్ ఛైర్మన్ కుంభం సాయిబాబు వెల్లడించారు. ఇవ్వటం జరుగుతుందన్నారు. ఉత్తరద్వారా దర్శనం సందర్భంగా ఏడు వేలమంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించేందుకు సన్నాహాల్లో ఉన్నారు. మొత్తంమీద ఆరోజు 10 వేల నుంచి 15 వేల మంది భక్తులు విచ్చేసే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు.

దక్షిణ భారత స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు గుంటూరు ప్రాజెక్టు



జిల్లాస్థాయి ప్రదర్శనలో విద్యార్థినులను అభినందిస్తున్న డీఈవో రేణుక

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు బ్రాడీపేటలోని శారదానికేతన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎండీ అనీసాబేగం, ఎస్.ఈర్చిత రూపొందించిన గగన్‌యాన్ మిషన్ ప్రాజెక్టు దక్షిణ భారతదేశ స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈనెల 4న గుంటూరులో జరిగిన జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్రస్థాయికి ఎంపికైన "గగన్‌యాన్ మిషన్" తాజాగా మంగళ, బుధవారాల్లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో దక్షిణ భారతదేశ స్థాయికి అర్హత సాధించింది. ఈనెల 21 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో ప్రదర్శన జరగనుంది. శారదానికేతన్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినులు ఎండీ అనీసాబేగం, ఎస్.ఈర్చిత గైడ్ టీచర్ ఆరిఫ్ బేగ్ సహకారంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అంతరిక్షంలోకి మానవులు ప్రయాణించేందుకు వీలుగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సొంతంగా చేపడుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు గగన్‌యాన్ విశేషాలతో రూపొందించిన ఈ ప్రాజెక్టు సందర్శకులను విశేషంగా ఆకట్టుకోవడంతోపాటు న్యాయ నిర్ణేతల ప్రశంసలు అందుకుంది. అంతరిక్షంలోకి మనుషులను తీసుకువెళ్లి, సురక్షితంగా తీసుకువచ్చేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనలపై నమూనా ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థినులు గగన్‌యాన్ మిషన్ విశేషాలను చక్కగా వివరించారు. ఈ సందర్భంగా డీఈఓ సీవీ రేణుక.. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.ఉషాకుమారితో పాటు గైడ్ టీచర్ ఆరిఫ్ బేగ్, విద్యార్థినులను అభినందించారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 169 మంది అర్హత



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): నగరంపాలెంలోని పోలీస్ పరేడ్ మైదానంలో కొనసాగుతున్న కానిస్టేబుళ్ల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. అభ్యర్థుల వివరాలు, ఏర్పాట్లు, పోటీల నిర్వహణపై పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బుధవారం 305 మంది హాజరుకాగా, 74 మంది ధ్రువపత్రాలు తీసుకురాకపోవడంతో వెనుదిరిగారు. 231 మందికి శరీర కొలత పరీక్షలు నిర్వహించగా, వారిలో 24 మంది ఛాతి, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో నిష్క్రమించారు. 1600 మీటర్ల పరుగు పందెం పోటీలను 205 మందికి నిర్వహించగా, 179 మంది అర్హత సాధించారు. వారికి 100 మీటర్ల పరుగు పందెం పోటీలు జరగ్గా 100 మంది అర్హత పొందారు. లాంగ్ జంప్ పోటీల్లో 168 మంది అర్హత సాధించారు. 231 మంది కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా, 169 మంది అర్హత సాధించారు.

ఆర్‌ఎస్‌కేల ద్వారా ధాన్యం కొనుగోలు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

నరసరావుపేట రూరల్: రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని పాలపాడు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఏవో.. గ్రామంలోని మొక్కజొన్న పంటను పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో అన్నదాతలతో సమావేశం నిర్వహించారు. రైతు సేవా కేంద్రం ద్వారా ఎరువులను సరఫరా చేయాలని, ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. దీనిపై డీఏవో మాట్లాడుతూ అవసరాన్ని బట్టి ఎరువులు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. జిల్లాలో ఐదు వేలకుగాను, ఇప్పటికే 3,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. మరో ఐదు వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వ అనుమతి కోరామని వివరించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణపై దృష్టి సారించాలని తెలిపారు. గొంగళి పురుగు ముఖంపై తిరగబడిన ఆకారంలో తెల్లని చారలను కత్తెర పురుగు కలిగి ఉంటుందని తెలిపారు. ఈ పురుగు నివారణకు ఎకరానికి లీటరు 1500 పీపీఎం వేపనూనె, 10,000 పీపీఎం వేపనూనె శాతం 200ఎంఎల్ పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీసీ డీడీఏ ఎం.శివకుమారి, ఏడీఏ పి.మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబు, డీసీ చైర్మన్ పులిమి రామిరెడ్డి, వీఏఏ ఎం.బోస్, రైతులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన దాచేపల్లి పాఠశాల విద్యార్థి



అంబుబ్యాగ్ నమూనా ప్రదర్శనతో దిలీప్

నరసరావుపేట ఈస్ట్: దక్షిణ భారత సైన్స్ ఫెయిర్ 2024-25 కు పల్నాడు జిల్లా దాచేపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థి ప్రజాపతి దిలీప్ ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ బుధవారం తెలిపారు. విజయవాడలో ఈ నెల 7, 8వ తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలో దిలీప్ ప్రదర్శించిన అంబు బ్యాగ్ నమూనా ఎంపికైనట్లు వివరించారు. రాష్ట్ర సమగ్ర శిక్ష సంచాలకుడు బి.శ్రీనివాస్, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎం.కృష్ణారెడ్డి చేతుల మీదుగా దిలీప్ బహుమతి అందుకున్నాడని తెలిపారు. అంబు బ్యాగ్ ద్వారా ఆస్మా రోగులకు అత్యవసర సమయాలలో శ్వాస అందించేందుకు వీలుంటుందని, టీచర్ గైడ్ ఉపాధ్యాయుడు ప్రసాద్ సహకారంతో దిలీప్ దీనిని రూపొందించాడని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆస్మా రోగులకు ఉపయోగపడే కృత్రిమ శ్వాస మిషన్ కొనుగోలు చేయాలంటే రూ. 2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు అవుతుందని చెప్పారు. దిలీప్ దీని తయారీకి డ్రిల్లింగ్ మిషన్, పిస్టన్, ప్రజర్ బ్యాగ్ ఉపయోగించాడన్నారు. దీని తయారీకి కేవలం రూ.3 వేలు మాత్రమే అవుతోందని తెలిపారు. ఆసుపత్రులు అందుబాటులో లేనిచోట, పర్వత ప్రాంతాలలోని అత్యవసర సమయాలలో ఇది రోగులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి పుదువైలో జరగనున్న దక్షిణ భారత విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో దిలీప్ ఈ నమూనాతో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. విద్యార్థి దిలీప్, గైడ్ టీచర్ ప్రసాద్‌ను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, డీఈఓ చంద్రకళ తదితరులు అభినందించారు.

రేపు తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ చెప్పారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.